RNI: TELTEL12215
https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
# ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## ఆర్టిలక్ 370 రద్దుపై సుప్రీం చారిత్రాత్మకమైన తీర్పు

### మోడీ హర్షం

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు



ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు ఈరోజు చారిత్రా త్మకమైన తీర్పునిచ్చింది. 370 రద్దుపై కేంద్రం తీసుకున్న నిర్ణయం సరైందేనని సుప్రీం సమర్థించింది. ఈ సందర్భంగా సుప్రీం తీర్పుపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ హర్షం వ్యక్తం చేశారు. ఆశాజనకమైన తీర్పు అని మోడీ సామాజిక మాధ్యమం

మిగతా 2లో

RANGAREDDY, EDITION : 01, VOLUME :207 EDITOR: CHERUKU UPENDAR, DATE : TUESDAY 12 DECEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 207 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : మంగళవారం 12 డిసెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-




## ఆర్టికల్ 370 రద్దు సబబే

- ప్రభుత్వ చర్యకు సుప్రీం సమర్థన
- జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హెూదా పునరుద్ధరించండి
- 2024 సెప్టెంబర్ 30 లోగా ఎన్నికలు జరపండి

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు: జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక హెూదా కల్పించిన ఆర్టికల్ 370ని మోడీ ప్రభుత్వం రద్దు చేయడాన్ని సుప్రీంకోర్టు సోమవారం సమర్థించింది. ఈ అధికరణ తాత్కాలికమైనదేనని, దీనిని రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంటుందని స్పష్టం చేసింది. జమ్ముకాశ్మీకు రాష్ట్ర హెూదాను పునరుద్ధరించి, వచ్చే సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీ లోపు ఎన్నికలు నిర్వహించాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. 2019 ఆగస్టు 5న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసింది. రాష్ట్రపతి ఆదేశం పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. ఈ నిర్ణయం రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ సిపిఐ(ఎం) పిటిషన్‌తో సహా 23 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్

మిగతా 2లో

# జమ్ము కాశ్మీర్ బిల్లులకు.. రాజ్యసభ ఆమోదం


## - అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ ప్రతిపక్షాలు వాకౌట్

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు



జమ్మూ కాశ్మీర్ రిజర్వేషన్ సవరణ బిల్లు, జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లులను రాజ్యసభ ఆమోదించింది. లోక్‌సభ ఆమోదించిన జమ్మూ కాశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు, 2023, జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లును సోమవారం రాజ్యసభలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. దీనిపై జరిగిన చర్చలో వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు. కేంద్ర మంత్రి అమిత్ షా సమాధానం తరువాత బిల్లులు ఆమోదించారు. కాంగ్రెస్, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొని ఓబీసీ వ్యతిరేకి అంటూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ రాజ్యసభ నుంచి ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. అనంతరం మూజువాణి ఓటుతో రెండు బిల్లులను ఆమోదించుకున్నారు. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ ఆగస్టు 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసే రాష్ట్రపతి అధికారాన్ని సుప్రీంకోర్టు సమర్థించినప్పటి నుంచి ఇది ఒక మైలురాయని అన్నారు. ఆర్టికల్ 370 తాత్కాలిక చర్య అని సుప్రీంకోర్టు గుర్తించిందని అన్నారు. తగిన సమయంలో రాష్ట్ర హెూదాను పునరుద్ధరిస్తామని, తాను పార్లమెంటులో చెప్పానని, సుప్రీంకోర్టు కూడా

మిగతా 2లో



## మరోసారి కలవరపెడుతున్న కోవిడ్

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

కరోనా కనుమరుగైపోయిందని అందరూ ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే ఇలాంటి తరుణంలోనే దేశ ప్రజానీకాన్ని మరోసారి కరోనా కలవరపెడుతోంది. అనూహ్యంగా దేశంలో కరోనా కేసులు పెరిగాయి. కేవలం ఆదివారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 166 కరోనా కొత్త కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ సోమవారం వెల్లడించింది. తాజా కేసులతో కలిపి దేశవ్యాప్తంగా మొత్తంగా 895 యాక్టివ్ కేసులున్నాయి. కరోనా వేరియంట్ ఇన్ఫ్లూయెంజా వైరస్ వల్లే శీతాకాలంలో కరోనా కేసుల పెరుగుదలకు కారణమని కేంద్రప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కరోనా కేసులు పెరగడంతో శీతాకాలంలో అప్రమత్తంగా ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సూచించింది. కాగా, కరోనా వైరస్ వ్యాప్తి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 4.44 కోట్ల మంది ఈ

మిగతా 2లో



ఉచిత బస్సు సౌకర్యం

## మహిళలకు ఎంతో మేలు

మాజీ ఎంపీ రేణుకా చౌదరి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని మాజీ ఎంపీ కాంగ్రెస్ నేత రేణుకా చౌదరి అన్నారు. సోమవారం గాంధీ భవన్ నుంచి మహిళలతో కలిసి లక్‌డీకపూల్ వరకు ఆమె బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఉచిత బస్సు పథకాన్ని మహిళలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ లాంటి మహానగరంలో చిన్నా చితక ఉద్యోగులు, వ్యాపారులకు ఈ పథకం వరమని అన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో

మిగతా 2లో

# రైతు బంధు ఇచ్చేయండి

## సీఎం రేవంత్ ఆదేశాలు

- రూ.2 లక్షల రుణమాఫీపై కార్యాచరణ ప్రణాళిక
- ప్రజా దర్బార్.. ఇక నుంచి ప్రజావాణి
- వారానికి రెండు రోజులు నిర్వహణ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



రాష్ట్రంలోని రైతులందరికీ రైతు బంధు నిధులను అన్నదాతల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను తక్షణమే (సోమవారం సాయంత్రం నుంచే) ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఏ ఒక్క రైతుకూ ఇబ్బంది కలగకుండా పంట పెట్టుబడి సాయాన్ని అందించాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతు భరోసా కింద ఒక్కో రైతుకు రూ. 15 వేలు ఇస్తామని ప్రకటించింది. అయితే దానికి విధి విధానాలు, నియమ నిబంధనలు ఖరారు కాకపోవటంతో ప్రస్తుతానికి బీఆర్ఎస్ సర్కారు అమల్జేసిన రైతుబంధు కిందే నిధులు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. సంబంధిత నిధులు ఇప్పటికే ట్రెజరీల్లో ఉన్నందున వెంటనే వాటిని రైతుల ఖాతాల్లో వేయాలని సూచించారు. అన్నదాతలకు రూ. 2 లక్షల రుణ మాఫీపై కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వ్యవసాయ శాఖపై సీఎం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దాదాపు మూడు గంటలపాటు నిర్వహించిన ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ, సంబంధిత విభాగాల పనితీరు, రైతు సంక్షేమ కార్యక్రమాల అమలుపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని రైతులకు రెండు లక్షల మేరకు రుణ మాఫీ చేసేందుకు తగు కార్యాచరణ

మిగతా 2లో



## వికసిత్ భారత్-2047 లక్ష్యం

- వీసీలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆదేశం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

వికసిత్ భారత్-2047 లక్ష్యానికి అనుగుణంగా విద్యావంతులు, అకడమిక్ నిపుణులు పనిచేయాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కోరారు. నిటి ఆయోగ్, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో వికసిత్ భారత్-2047 వర్క్‌షాప్‌ను నిర్వహించాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ వర్క్‌షాప్‌ను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ వికసిత్ భారత్-2047ను ప్రారంభించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆ విజన్‌లో తెలంగాణ, పాండిచ్చేరి ప్రజలు

మిగతా 2లో

# త్వరగా కోలుకుని ప్రజాసేవకు రావాలి

- కేసీఆర్‌కు చంద్రబాబు సహా పలువురి పరామర్శ
- భట్టి, చిరంజీవి, ప్రకాశ్‌రాజ్, భీమ్ ఆర్మీ చీఫ్ , ప్రవీణ్‌కుమార్ రాక

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావును తెలుగుదేశం అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు పరామర్శించారు. వీలైనంత తొందరగా కోలుకొని ప్రజాసేవకు రావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను సోమవారం చంద్రబాబు కలిశారు. దాదాపు ఇరవై నిమిషాలు అక్కడ గడిపారు. పక్కనే కూర్చుని కేసీఆర్‌తో మాట్లాడారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి వద్ద చంద్రబాబుకు యశోద యాజమాన్యంతోపాటు మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, వి. శ్రీనివాస్‌గౌడ్, ఇతరులు స్వాగతం పలి కారు. కేసీఆర్

మిగతా 3లో



# ఆర్టికల్ 370 రద్దు సబబే

(మొదటిపేజీ తరువాయి)
నేతృత్వంలోని అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారించి ఒక ప్రధానమైన తీర్పును, మరో రెండు ఉప తీర్పులను ఇచ్చింది. న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, సంజయ్ ఖన్నా, బిఆర్ గవాయ్, సూర్యకాంతతో కూడిన ఈ రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెలువరించే సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. జమ్ముకాశ్మీర్‌కు అంతర్గత సార్వభౌమాధికారం లేదని, రాష్ట్రపతి పాలన అమలులో ఉన్నప్పుడు కేంద్రం తీసుకునే ప్రతి నిర్ణయాన్నీ సవాలు చేయలేరని చెప్పింది. జమ్మూ కాశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేసే సమయంలో పొందుపరచిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 తాత్కాలిక నిబంధన అని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ తన తీర్పులో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని నిబంధనలను అమలు చేయడానికి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి అవసరం లేదని సుప్రీంకోర్టు ఆ తీర్పులో పేర్కొంది. ఏదైనా ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చవచ్చా? లేదా? అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానమేమీ లేదని వ్యాఖ్యానించింది. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని, వచ్చే సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీ లోగా ఎన్నికలు నిర్వహించాలని కేంద్రాన్ని ఆదేశించింది.

ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ 2019 ఆగస్ట్ ఐదవ తేదీన పార్లమెంట్ నిర్ణయం తీసుకుంది. దీనిని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో 23 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ధర్మాసనం ఆగస్ట్ 2 నుండి సుదీర్ఘంగా విచారణ జరిపింది. సెప్టెంబర్ 5న తీర్పును రిజర్వ్ చేసిన న్యాయస్థానం సోమవారం దానిని వెలువరించింది.

# ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు ఎంతో మేలు

(మొదటిపేజీ తరువాయి)
పెట్టిన అన్ని హామీలను అమలు చేస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు ఇక రెస్ట్ తీసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్ల కాలంలో చేసిన తప్పులను పునరావృతం కాకుండా మంచి పాలనను అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చి రెండు రోజులు కాకముందే కొంతమంది విమర్శలు మొదలు పెట్టడం సబబు కాదని హితవు పలికారు.

# వికసిత్ భారత్-2047 లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)
భాగస్వాములవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. దీన్ని అమలు చేయడంపై దృష్టికేంద్రీకరించాలని సూచించారు. కచ్చితంగా అమలు చేయాలనీ, సాకులు చెప్పొద్దని కోరారు. ఆనందంగా చదువు చెప్పే బోధనా పద్ధతులను అనుసరించాలని చెప్పారు. వికసిత్ భారత్-2047లో భాగస్వాములయ్యేలా విద్యార్థులను ప్రోత్సహించాలనీ, వారి ఆలోచనలు ఎంతో ముఖ్యమని విద్యావంతులు, బోధనా సిబ్బందికి సూచించారు. అందరికీ నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ లక్ష్యానికి విద్యార్థులెవరూ దూరం కావొద్దని కోరారు. శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో నూతన ఆవిష్కరణలు వస్తాయనీ, భారత్ సాధికారత సాధిస్తుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర, ప్రయివేటు విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు, ఐఐటీలు, ఎన్ఐటీలు, ఎయిమ్స్‌కు సంబంధించిన వీసీలు, డైరెక్టర్లు, డీన్లు, బోధనా సిబ్బంది ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఎస్‌కె మహమూద్, వీసీలు డి రవీందర్, టి రమేష్, సిహెచ్ గోపాల్‌రెడ్డి, కట్టా నర్సింహారెడ్డి, కె సీతారామారావు, వి వెంకటరమణ, సురేష్‌బాబు, కవితా దర్యానిరావు, టి కిషన్‌రావు, లక్ష్మీకాంత్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిలక్ 370 రద్దుపై సుప్రీం చారిత్రాత్మకమైన తీర్పు

(మొదటిపేజీ తరువాయి)
ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ తీర్పుపై మోడీ 'ఒకప్పటి రాష్ట్ర (ఇప్పుడు రెండు కేంద్రపాలిత ప్రాంతాలు) ప్రజల కలలను నెరవేర్చడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని పోస్టులో పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీం కోర్టు నేడు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనది. ఆగస్టు 5, 2019న భారత పార్లమెంటు తీసుకున్న నిర్ణయాన్ని రాజ్యాంగబద్ధంగా సమర్థిస్తుంది అని మోడీ అన్నారు. 'ఇది జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లోని మా సోదర సోదరీమణులకు ఒక ఆశను కల్పించింది. పురోగతితోపాటు, ఐక్యతకు నిదర్శనంగా ఈ తీర్పు ఉంది. సర్వోన్నత న్యాయస్థానం అపారమైన జ్ఞానంతో భారతీయులుగా మనం ఎంతో ప్రేమించే, గౌరవించే ఐక్యత యొక్క సారంశాన్ని బలపరిచింది. ఆర్టికల్ 370 కారణంగా నష్టపోయిన మన సమాజంలోని జమ్మూకాశ్మీర్, లడఖ్‌లోని ప్రజల కలల్ని నెరవేర్చడానికి మేము నిబద్ధతతో కృషి చేస్తామని నేను హామీ ఇస్తున్నాను. అత్యంత బలహీన, అట్టడుగు వర్గాలకు ప్రగతి ఫలాలు అందేలా చూస్తాము. ఈరోజు తీర్పు కేవలం చట్టపరమైన తీర్పు కాదు. ఇది ఒక ఆశాకిరణం. ఉజ్వల భవిష్యత్తు యొక్క వాగ్దానం. బలమైన, మరింత ఐక్యమైన భారతదేశాన్ని నిర్మించాలనే మా సమిష్టి సంకల్పానికి నిదర్శనం.' అని మోడీ తన పోస్టులో పేర్కొన్నారు.

# మరోసారి కలవరపెడుతున్న కోవిడ్

(మొదటిపేజీ తరువాయి)
వైరస్ బారినపడ్డారు. దాదాపు 5,33,306 మంది కరోనాతో మృతి చెందారు. ప్రస్తుతం దేశంలో కరోనా మరణాల రేటు 1.19గా ఉంది. ఇక కరోనా నియంత్రణా చర్యల్లో భాగంగా.. ఇప్పటివరకు కేంద్రం 220.67 కోట్ల వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేసింది.

# జమ్మూ కాశ్మీర్ బిల్లులకు రాజ్యసభ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)
తన తీర్పులో తన వైఖరిని అంగీకరించిందని పేర్కొన్నారు. "గుజరాత్, రాజస్థాన్‌లకు పాకిస్తాన్‌తో సరిహద్దులు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, అసోం మొదలైన రాష్ట్రాల్లో కాశ్మీర్ కంటే ఎక్కువ మంది ముస్లింలు ఉన్నారు. వేర్పాటువాదం వెనుక కారణాలు ఇవే కాదు. ఆర్టికల్ 370. కాశ్మీర్‌లో వేర్పాటువాదం ఉగ్రవాదానికి దారితీసింది" అని ఆయన అన్నారు. "జమ్మూలో ఇప్పుడు 43 సీట్లు (37 నుంచి), కాశ్మీర్‌లో ఇప్పుడు 47 సీట్లు (46 నుంచి). పీఓకెలోని ఇరవై నాలుగు సీట్లు రిజర్వ్‌లో చేశాం. ఎందుకంటే ఇది దేశంలో భాగమని మేము ఇప్పటికీ నమ్ముతున్నాము" అని అన్నారు. తమ ప్రభుత్వం స్థానికుల జీవితాలను మెరుగుపర్చిందని అన్నారు. కాశ్మీర్ ప్రజలు ఇప్పుడు ప్రజాస్వామ్యం, అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారని, వేర్పాటువాద ప్రవర్తనలను, ప్రాచుర్యం పొందాలనుకునే వారిని పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. యువత చేతుల్లో రాళ్లు పోయి, ల్యాప్‌టాప్‌లు వచ్చాయని తెలిపారు. వైసీపీ ఎంపీ వి.విజయ సాయి రెడ్డి మాట్లాడుతూ కాశ్మీర్ సమస్య పరిష్కారానికి అడ్డుపడుతున్నందుకు నెహ్రూవియన్ సూడో సెక్యులరిజాన్ని విమర్శిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపాలన్నది తమ ఉద్దేశమని ఆయన తెలిపారు. ఆర్టికల్ 370, పాకిస్తాన్‌తో రెండోయుద్ధంలో కాశ్మీర్‌ను తిరిగి పొందడంలో వైఫల్యం ముఖ్యమైన తప్పిదాలుగా పేర్కొన్నారు. పరిస్థితిని సరిదిద్దడానికి బంగ్లాదేశ్ యుద్ధం తరువాత సిమ్లా డిక్లరేషన్‌పై సంతకం చేసే సమయంలో అవకాశం కోల్పోయిందని ఆయన సూచించారు. ఎన్నికలు జరగని పీఓకెలోని 24 స్థానాలకు అక్కడి సభ్యులను నామినేట్ చేయాలని ప్రతిపాదించారు. వలసదారులకు నగదు ఉపశమనాన్ని పెంచాలని ఆయన అభ్యర్థించారు. ఆర్టికల్ 370 రద్దు చేసినప్పటి నుండి జమ్మూ కాశ్మీర్ గణనీయమైన పురోగతిని సాధించిందని ఆయన ప్రశంసించారు.

కాశ్మీర్ భారతదేశంలో భాగం కావడానికి నెహ్రూ కారణమని కాంగ్రెస్ ఎంపీ సయ్యద్ నాసిర్ హుస్సేన్ తెలిపారు. వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి నెహ్రూపై చేసిన వ్యాఖ్యలపై నాసిర్ హుస్సేన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. విజయసాయి రెడ్డికి నెహ్రూ, పటేల్ దృక్కోణాలపై అవగాహన లేదన్నారు. కాంగ్రెస్ ఎంపీ వివేక్ తంఖా మాట్లాడుతూ ఈ సమస్య గురించి మాట్లాడటానికి ఒక కాశ్మీరీ పండిట్‌కు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను తొలగించారని, 2024 ముగిసేలోపు ఎన్నికలు నిర్వహించాలని కోర్టు వ్యాఖ్యానించిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతంలో విద్యుత్ కొరతతో సహా అనేక సమస్యలు ఉన్నాయని, అక్కడి వ్యక్తులు కేంద్ర పాలిత ప్రాంత ప్రయోజనాలను పొందడం లేదని ఆయన తెలిపారు. జమ్మూ కాశ్మీర్ సమస్యల గురించి కొంచెం ఆలోచించండి అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్ మాట్లాడుతూ ఆర్టికల్ 370 రద్దు తరువాత జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదం నిర్మూలించబడిందా? అని ప్రశ్నించారు

.సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌లో రాష్ట్ర హోదాను తొలగించాల్సిన అవసరమని అన్నారు. ఫెడరలిజం సూత్రాలకు విఘాతం కలిగిస్తోందని, ఈ చర్య అవసరమని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రాంతం స్వయంప్రతిపత్తి, దేశంలోని మొత్తం సమాఖ్య పాలనపై అటువంటి నిర్ణయం ప్రభావం గురించి అభ్యంతరాలను వ్యక్తం చేశారు. అప్పట్లో నెహ్రూ లేకపోతే ఈరోజు జమ్మూకాశ్మీర్‌పై చర్చ జరిగేది కాదన్నారు. మీడియాను ప్రభుత్వం నియంత్రిస్తోందని మరో సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్ అన్నారు.

సీపీఐ ఎంపీ పి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ కాశ్మీర్‌లో బీజేపీ స్వయం ప్రతిపత్తి రాజ్యాంగంలా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్‌సీపీ ఎంపీ ఫౌజియా ఖాన్ మాట్లాడుతూ మిలిటెన్సీ కాశ్మీర్ అందాన్ని తినేసే క్యాన్సర్ అని అన్నారు. డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిధిలో రాష్ట్ర హక్కులను అమలు చేయాలని కోరారు. లోక్‌సభ ఎన్నికలతోనే జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని ఆప్ ఎంపీ సంజయ్ అరోరా కోరారు. పంజాబీ ప్రజలను, ముఖ్యంగా హిందూ పండిట్‌ల మాదిరిగానే కష్టాలను ఎదుర్కొన్న సిక్కులను సమానంగా పరిగణించాలని కోరారు.

బీజేపీ ఎంపీ సుధాన్షు త్రివేది మాట్లాడుతూ కాశ్మీర్‌లో డీలిమిటేషన్, నివాసం, అభివృద్ధి అనే మూడు సమస్యలు ఉన్నాయని అన్నారు. బీజేపీ ఎంపీ సుశీల్ కుమార్ మోడీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇతర వెనుకబడిన తరగతులకు వ్యతిరేకమని, మోడీ ప్రభుత్వం అన్ని కులాల వారికి సమాన అవకాశాలు కల్పించిందని అన్నారు.

# త్వరగా కోలుకుని ప్రజాసేవకు రావాలి

(మొదటిపేజీ తరువాయి)
దగ్గరే ఉన్న కేసీఆర్ కుమారుడు కేటీఆర్, కూతురు కవితతోనూ చంద్రబాబు ముచ్చటించారు. అనంతరం ఆస్పత్రి వెలుపల మీడియాతో మాట్లాడుతూ 'ఆయనతో మాట్లాడాలనిపించి వచ్చాను. కోలుకోవడానికి ఆరువారాల సమయం పడుతుందని వైద్యులు చెప్పారు. చాలా చక్కగా ఆపరేషన్ జరిగింది. త్వరలోనే కేసీఆర్ మామూలుగా నడుస్తారు' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పరామర్శించి వెళుతున్న క్రమంలో కేటీఆర్, చంద్రబాబును ఆస్పత్రి బయటకు తోడ్కొని వచ్చి సాగనంపారు. అలాగే తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేసీఆర్‌ను కలిసి మాట్లాడారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. సర్జరీ విజయవంతమైందని డాక్టర్లు తనకు చెప్పినట్టు భట్టి మీడియాతో అన్నారు. మరోవైపు బీఆర్ఎస్ మాజీ మంత్రులు పి.సబితాఇంద్రారెడ్డి, సత్యవతిరాథోడ్, గంగుల కమలాకర్, చామకూర మల్లారెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు ప్రముఖ సినీనటుడు ప్రకాశ్‌రాజ్, బీఎస్పీ నేత ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, కేసీఆర్‌ను పరామర్శించి, క్షేమసమాచారం తెలుసుకున్నారు. గురువారం రాత్రి ఎర్రవల్లి ఫార్మ్‌హౌజ్ బాత్‌రూంలో జారిపడటంతో కేసీఆర్ ఎడమ తుంటికి తీవ్రగాయమైన సంగతి తెలిసిందే. సోమాజిగూడలోని యశోద ఆస్పత్రి డాక్టర్లు ఆయనకు శుక్రవారం రాత్రి తుంటిమార్పిడికి ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం కేసీఆర్ గత మూడు రోజులుగా ఆస్పత్రిలో ఉంటూ చికిత్స తీసుకుంటున్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌కు రాజకీయ నాయకులు, సినిమా పరిశ్రమ నుంచి సోమవారం పరామర్శల వెల్లువ కొనసాగింది. చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను మెగాస్టార్ చిరంజీవి పరామర్శించారు. కేసీఆర్‌ను ఉత్సాహ పరిచే ప్రయత్నం చేశారు. సినిమా పరిశ్రమ పరిస్థితి గురించి చిరంజీవిని అడగ్గా, బాగుందని ఆయన సమాధానమిచ్చారు. కేటీఆర్, కవితతోనూ చిరంజీవి మాట్లాడారు. అలాగే భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్, ఎన్టీవీ చైర్మెన్ నరేన్‌చౌదరి సైతం పరామర్శించినవారిలో ఉన్నారు.

**కేటీఆర్‌తో మాట్లాడిన గవర్నర్**

కేసీఆర్ ఆరోగ్యం గురించి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళసై సౌందరరాజన్ కేటీఆర్‌తో ఫోన్లో మాట్లాడారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రొటెంస్పీకర్ ప్రమాణం సందర్భంగా కూడా మాజీ మంత్రి హరీశ్‌రావుతో కేసీఆర్ ఆరోగ్యపరిస్థితి గురించి అడిగితెలుసుకున్నారు.

రేవంతన్న ..మీతో మాట్లాడాలన్నా..

సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ఆస్పత్రికి వెళ్లి కేసీఆర్‌ను పరామర్శించిన సంగతి తెలిసిందే. ఆస్పత్రి నుంచి వెళ్లిపోతున్న క్రమంలో 'రేవంతన్నా రేవంతన్నా.. అని ఒక అమ్మాయి గట్టిగానే పిలిచింది. మీతో మాట్లాడాలన్నా ..మీతో మాట్లాడాలన్నా అని రెండుసార్లు అంది. ఆ పిలుపు విన్న సీఎం రేవంత్ అమ్మాయి వైపు వచ్చారు. అప్పటికే ఆస్పత్రితోపాటు ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది ఆ అమ్మాయిని ఆపేశారు. ఆ అమ్మాయి ఉన్న చోటుకి సీఎం వస్తూ 'అక్కడే ఉండు..అక్కడే ఉండు..నేనే వస్తా అంటూ..ఏంటీ ప్రాబ్లమ్' అని పలకరించారు. 'మా తాతయ్యకు ఒక్కరోజే లక్ష రూపాయలు అయిందన్న..కొంచెం చూడండి అని తన గోడును వెళ్లబోసుకుంది. ప్లీజ్ హెల్ప్ చేయండన్నా..ప్లీజ్ అంటూ ఆయన కాళ్లపై పడే ప్రయత్నం చేసింది. అందుకు ఆమె ప్రయత్నాన్ని అడ్డుకుంటూ వెంటనే సీఎం రేవంత్ స్పందించి సమస్యను పరిష్కరించాలంటూ తన సిబ్బందిని ఆదేశించారు. అమ్మాయిని సముదాయించి అక్కడి నుంచి వెళ్లిపోయే వీడియో సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. సీఎం రేవంత్ స్పందన, ఆయన ఉదారత పట్ల నెటిజన్లు హర్షం వ్యక్తం చేశారు.

# రైతు బంధు ఇచ్చేయండి

(మొదటిపేజీ తరువాయి)
ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. ప్రస్తుతం హైదరాబాద్ బేగంపేటలోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌ను ఇకనుండి 'ప్రజావాణి'గా పిలవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ఇక నుంచి ప్రతీ మంగళ, శుక్ర వారాల్లో రెండు రోజులపాటు ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని ప్రకటించారు. ఉదయం 10 గంటలలోపు ప్రజాభవన్‌కు చేరుకున్న వారికి ప్రజావాణిలో అవకాశం కల్పించాలని సూచించారు. వికలాంగులు, మహిళలకు ప్రత్యేక క్యూ-లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం తాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతరను ఘనంగా నిర్వహించాలి

**గిరిజన సంక్షేమ శాఖలో సమీక్షించిన మంత్రి సీతక్క**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగనున్న మేడారం జాతరను ఘనంగా నిర్వహించాలనీ, భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలిచ్చారు. సోమవారం హైదరాబాద్ లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతరలో పారిశుధ్యం, రహదారులు, విద్యుత్తు, తాగునీటి లభ్యత, స్నానాల ఏర్పాట్లు, భక్తుల వసతులు తదితర అంశాలవారీగా సంబంధిత అధికారులతో చర్చించారు. కోయ గిరిజన ఇలవేల్పుల సమ్మేళనం ఈ సారి జాతర సమయంలోనే జరిగేటట్టు చూడాలనీ, తద్వారా భక్తులకు గిరిజన సాంస్కృతిక వైభవం గురించి బాగా తెలుస్తుందని చెప్పారు. మేడారం జాతరకు జాతీయ పండుగ హోదాకోసం కేంద్ర ప్రభుత్వానికి మరో సారి ప్రతిపాదనలు పంపుతామనీ, రాష్ట్ర బడ్జెట్‌కు కేంద్రం నిధులు తోడైతే.. జాతరను మరింత ఘనంగా నిర్వహించు కోవచ్చు నన్నారు. వచ్చే వారం ఏటూరునాగారంలోని ఐటీడీఏ అధికారులతో సమీక్ష నిర్వహించి జాతర పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ తన తల్లివంటిదనీ, శాఖ ఉద్యోగులు తనను సోదరిలా భావించి తమ సమస్యలను ఎప్పుడైనా చెప్పుకోవచ్చని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చొంగ్తు సమన్వయం చేయగా శాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్ శంకర్, ట్రైకార్ జీఎం శంకర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో బంగారం పట్టివేత..

**శంషాబాద్ - ప్రభాత సూర్యుడు :** ఓ వ్యక్తి దుబారు నుంచి అక్రమంగా బంగారాన్ని తరలిస్తూ కస్టమ్స్ అధికారులకు పట్టుబట్ట ఘటన శంషాబాద్ విమానాశ్రయంలో సోమవారం చోటుచేసుకుంది. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం దుబారు నుంచి హైదరాబాద్‌కు విమానంలో వచ్చిన ప్రయాణికులను శంషాబాద్ విమానాశ్రయంలో తనిఖీలు చేస్తున్న సమయంలో ఓ ప్రయాణికుడిపై అనుమానం వచ్చి లగేజీ బ్యాగుతో పాటు ప్రయాణికుడిని స్కానింగ్ చేయడంతో వ్యక్తి వద్ద బంగారం ఉన్నట్లు కస్టమ్స్ అధికారులు గుర్తించారు. ప్రయాణికుడు బంగారాన్ని వైర్ రూపంలో తయారు చేసి మెటాలిక్ షోకేస్‌లో అమర్చుకొని అక్రమంగా దాచిపెట్టి తరలించే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. అతన్ని అదుపులోకి తీసుకొని రూ.27.92 లక్షల విలువ చేసే 449 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకొని.. అరెస్టు చేసి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## అద్దె కట్టలేదని ఈఎస్ఐ ఆస్పత్రికి తాళం



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

ఈఎస్ఐ డిస్పెన్సరీ భవనానికి అద్దె ఇవ్వడం లేదంటూ యజమాని తాళం వేశారు. అయినా అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో నాలుగు రోజులుగా డాక్టర్ బయటే విధులు నిర్వహిస్తున్నారు. చీటీ రాసివ్వడం తప్ప మందులు ఇవ్వలేకపోతున్నారు. దాంతోపాటు తమకు 8 నెలలుగా వేతనాలు రావడం లేదని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పోతురాజుపల్లిలో ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీ భవనానికి 19 నెలలుగా యజమానికి అద్దె ఇవ్వడం లేదు. దాంతో యజమాని డిస్పెన్సరీకి తాళం వేశారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో డాక్టర్ భరత్ నాలుగు రోజులుగా సిబ్బందితో కలిసి బయటే కూర్చొని రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. మందుల చీటీని రాసి ఇవ్వడం తప్ప మందులు ఇవ్వలేకపోతున్నారు. దాంతో మందులు బయట కొనుక్కోవడానికి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. యజమానికి ఇచ్చే అద్దె గురించి పై అధికారులకు నివేదికలు పంపామని, అక్కడి నుంచి సమాధానం రాలేదని డాక్టర్ భరత్ తెలిపారు. కాగా పోతురాజుపల్లిలో మినహా ఎక్కడా ఈఎస్ఐ డిస్పెన్సరీలు అందుబాటులో లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డిస్పెన్సరీని తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అలాగే డిస్పెన్సరీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగాలు చేస్తున్న ఏడుగురు తమకు ఎనిమిది నెలలుగా వేతనాలు కూడా రావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే) కార్యవర్గం డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి లో గల త్యాగరాయగాన సభలో హెచ్‌యూజే కార్యవర్గ సమావేశం జరిగింది. ఇటీవల మరణించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రం నర్సింగ్‌రావుకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌యూజే అధ్యక్షులు అరుణ్‌కుమార్, కార్యదర్శి బి.జగదీశ్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, విజయానంద్, హెచ్‌యూజే ఉపాధ్యక్షులు బీవీఎన్ పద్మరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్, ట్రెజరర్ రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగవాణి, జాయింట్ సెక్రటరీ అచ్చిన ప్రశాంత్, ఆఫీస్ బేరర్లు వీరేష్, సర్వేశ్వర్‌రావు, శివశంకర్, రమేష్, మధుకర్, నిస్సార్, లలిత, నర్సింహా, సాగర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బసవపున్నయ్య, అరుణ్‌కుమార్, జగదీశ్ మాట్లాడుతూ సుధీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతు, నేతన్న బీమాల మాదిరిగానే జర్నలిస్టుల బీమా పథకాన్ని తేవాలని కోరారు. టీవీలు, పత్రికలకిచ్చే యాడ్స్ నిధుల నుంచి జర్నలిస్టుల సంక్షేమం కోసం ఒకటి నుంచి రెండు శాతం జమచేయాలని విన్నవించారు. చాలా ఆస్పత్రుల్లో హెల్త్ కార్డులు పనిచేయడం లేదనీ, దీంతో వైద్యం విషయంలో జర్నలిస్టులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు.

# గజ్వేల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


### రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



**గజ్వేల్ - ప్రభాత సూర్యుడు :** "ప్రభుత్వం ఏర్పాటై వారం రోజులు కూడా గడవకముందే మాజీ మంత్రులు నోరు పారేసుకుంటున్నారు.. నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది.. కొత్త ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వడం మానుకుని విమర్శలు చేయడం సిగ్గుచేటు.." అని రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అనంతరం మొదటిసారిగా గజ్వేల్‌కు రావడంతో.. పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఇంట్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో పొన్నం మాట్లాడుతూ.. 'రైతుబంధు ఏది, రైతుబీమా ఏది, రైతుకు బోనస్ ఏది' అంటూ కొందరు మాజీ మంత్రులు మాట్లాడుతున్నారని.. నూతన ప్రభుత్వం ఏర్పడి వారం రోజులు కూడా కాలేదని అప్పుడే నోరు పారేసుకుంటే ఎలా అన్నారు. మీరు ఏ రోజైనా ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటి లేదా రెండో తారీఖీల్లో జీతాలు వేశారా అని ప్రశ్నించారు. కొందరు ప్రొఫెసర్లు సైతం ప్రభుత్వం ఆరు నెలలే ఉంటుందని.. అటు పిమ్మట ప్రభుత్వం కూలిపోతుందనడం తగదన్నారు. ప్రజలు తీర్పు ఇచ్చారని, ఆ తీర్పుకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం సమర్థవంతంగా నడుస్తుందని చెప్పారు. ప్రజలు తగిన బుద్ధి చెప్పినా.. మాజీ మంత్రులకు ఆశలు చల్లారలేదన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన రెండ్రోజుల్లోనే 6 గ్యారంటీల్లో రెండు అమలు చేశామని.. ఇది మాజీ మంత్రులకు కనిపించడం లేదా అని పశ్నించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని గతంలో వైయస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టారని.. నేడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ పథకాన్ని రూ.10లక్షలకు పెంచినట్టు గుర్తు చేశారు. మరో నాలుగు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, గండేల్లి, గౌరవెల్లి తదితర ప్రాజెక్టుల కింద నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం రావాల్సిన పూర్తి బెనిఫిట్స్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రితో చర్చిస్తామన్నారు. వారికి న్యాయం చేస్తామన్నారు. గజ్వేల్ అభివృద్ధి విషయంలో తాను ప్రత్యేక శ్రద్ధ వహిస్తానన్నారు. స్థానికంగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. ముఖ్యమంత్రిగా ప్రజలకు అందుబాటులోని ఉండని కేసీఆర్.. ప్రతిపక్ష నాయకుడిగానైనా అందుబాటులో ఉండాలని కోరారు. పేదల ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షల సాయం చేస్తామన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో ఐదువేల ఇండ్లు నిర్మించి.. ఇప్పటివరకు ఒక్క ఇల్లు కూడా పేదలకు ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, నాయకులు నాయిని యాదగిరి, మల్లారెడ్డి, సర్దార్ ఖాన్, రంగారెడ్డి, ముత్యాలు, రవీందర్ రెడ్డి, మోహన్, నక్క రాములు, నాయినితిరుపతి, ఇక్బాల్, వహీద్ ఖాన్, సురేష్, మామిడి కృష్ణ, రమేష్ గౌడ్, నాగరాజు గౌడ్, సీపీఐ నాయకులు మంద పవన్ తదితరులు ఉన్నారు.

# కాళేశ్వరంపై విచారణ సమగ్ర నివేదికకు ఆదేశం

- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల జాతీయ హెూదాకు కృషి
- కృష్ణాజలాల్లో న్యాయమైన వాటాకు చర్యలు
- భారీనీటిపారుదలశాఖ సమీక్షలో మంత్రి ఉత్తమ్



కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుపై విచారణ చేస్తామని రాష్ట్ర భారీ, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఆ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలతో సమగ్ర నివేదికను సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. త్వరలోనే మేడిగడ్డను సందర్శిస్తాననీ, అందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని భారీ నీటిపారు దల, ఆయకట్టు అభివృద్ధి శాఖ రాష్ట్ర కార్యాలయం జల సౌధలో సంబంధిత శాఖపై సమీక్ష చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు, కృష్ణా జలాలు, పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హెూదా, చెరువుల నిర్వహణ తదితర అంశాలపై ఉన్నతాధికారులతో పూర్తిస్థాయిలో దాదాపు గంటన్నరపాటు చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరంలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగడం తీవ్రమైన అంశమని వ్యాఖ్యానించారు. నిర్మాణం చేపట్టిన ఏజెన్సీని, అధికారులు తన పర్యటనలో ఉండేలా చూడాలని ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్‌ను ఆదేశించారు. వచ్చేవారం నుంచి ప్రతి ప్రాజెక్టుపై విడివిడిగా ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తానని అన్నారు. మేడిగడ్డను ఎవరు నిర్మించినా, జరిగిన ఘటనలకు బాధ్యత వహించాల్సిందేనని తేల్చి చెప్పారు. ప్రాజెక్టు కట్టిన ఏజెన్సీ, అధికారులు జబాబుదారులని స్పష్టం చేశారు. 'రూ.లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు కింద నామమాత్రం కొత్త ఆయకట్టు ఉంది. ఒక్కో ఎకరా సాగుకు అవుతున్న ఖర్చు వివరాలు చెప్పాలని అధికారులను అడిగా.ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల పురోగతిపై ఆరా తీశాను..సొరంగం పనుల చేస్తున్న సంస్థకు బిల్లులు బకాయి ఉన్నట్టు తెలిసింది..రాష్ట్రంలోని 40 వేల చెరువుల నిర్వహణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటా' అని చెప్పారు. కృష్ణాజలాల్లో రాష్ట్రానికి న్యాయమైన వాటాకోసం కృషిచేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల సైటు మార్చి, పేరు మార్చి, ఖర్చుపెంచినా పాలమూరు-రంగారెడ్డికి ప్రాధాన్యత ఇవ్వలేదని గుర్తు చేశారు. అలాగే తక్కువ ఖర్చుపెడితే పూర్తయ్యే ప్రాజెక్టులు ఎన్నో ఉన్నాయని, వాటిపై కూడా దృష్టిపెడతామని ప్రకటించారు. అమూల్యమైన ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూస్తామని స్పష్టం చేశారు. అనేక రకాల అరోపణలు ఉన్నాయనీ, విచారించి నిగ్గుతేలుస్తామని అన్నారు. రహస్యం, గోప్యం ఉండకూడదనీ, అవినీతి జరగకూడదన్నారు. అందుకే రాతపూర్వక నివేదిక అడిగినట్టు పేర్కొన్నారు. ప్రతిప్రాజెక్టు కొత్తఆయకట్టు లెక్కలు చెప్పాల్సిందేనని అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో ఆధారంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పోలింగ్ రోజు నాగార్జునసాగర్ డ్యాంపై జరిగిన తంతు అనుమానా స్పదంగా ఉందన్నారు. కాళేశ్వరంపై విచారణ ఉన్నతాధికారులతో చేయిస్తారా ? లేక సీఐడీతోనా అని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ 'ఇంకా అంతవరకు ఆలోచించలేదనీ, క్యాబినెట్, సీఎంతో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని' చెప్పారు.

ఆ సమాచారమివ్వండి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై పూర్తి సమాచారం సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దీనిపై ప్రత్యేకంగా సమీక్ష చేద్దామన్నారు. సీబ్ల్యూసీ అనుమతి లేకుండా ప్రాజెక్టులు ఏలా నిర్మిస్తారు ? నిధులు ఎలా సమీకరించారు ? అని ప్రశ్నించారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు థర్డ్‌పార్టీ చెకింగ్ లేదా ? కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సీడబ్ల్యూసీ అనుమతి ఉందా ? పాత ఆయకట్టును కూడా ఎందుకు కొత్త ఆయకట్టులో కలుపుతున్నారు ? వర్షం వచ్చినప్పుడు నీటిని లిఫ్ట్‌చేయాల్సిన అవసరం లేదు కదా ? నీటిపారుదల శాఖ పారదర్శకంగా, అవినీతికి తావు లేకుండా సమర్థంగా పనిచేయాలి. ఇదివరకు నీటిపారుదలశాఖలో ఏదో జరిగిందని అనుమానాలు ఉన్నాయి, వందేండ్లు ఉండాల్సిన ప్రాజెక్టులు మూడేండ్లకే దెబ్బతినడం ఆందోళనకరం. ఎందుకు అలా జరిగింది ? మంత్రి అధికారులను అడిగారు. దీంతో ఈఎన్సీలు, సీఈలు, ఎస్ఈలు తెల్లమొహాలేసినట్టు తెలిసింది. ఒక్క ఈఎన్సీ మురళీధర్ మినహా మరెవరూ జవాబు చెప్పే సాహసం చేయలేకపోయినట్టు సమాచారం. దీంతో ప్రాజెకుల్ట వారీగా పూర్తివివరాలతో సమీక్షకు వస్తామని అధికారులు చెప్పారు. చెప్పినా రాని స్మితాసభర్వాల్. మాజీ సీఎం కార్యదర్శి, సాగునీటిశాఖ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా నియమితులైన స్మితాసభర్వాల్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షకు హాజరుకాలేదు. గైర్హాజరుకు ఎలాంటి కారణాలు తెలియజేయలేదు. దీంతో చేసేది లేక ఇంజినీర్ ఇన్ చీఫ్ సి మురళీధర్ జలసౌధ సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్‌ను ఆహ్వానించారు. ఆయన వచ్చే సమయానికి ఈఎన్సీలు, సీఈలు, ఇతర అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలికారు.

**వాడీవేడిగా సమీక్ష**

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగడంపై మంత్రికి అధికారులు వివరణ ఇచ్చారు. 'మేడిగడ్డ బ్యారేజీ నిర్మానానికి రూ.4600 కోట్లు ఖర్చు చేశాం..అందులోని ఒక పిల్లర్ 1.2 మీటర్లు కుంగడంతో, మరో మూడు పిల్లర్లపై ఆ ప్రభావం పడింది..ముందురోజు సాయంత్రం పిల్లర్ కుంగిన వెంటనే ప్రాజెక్టులో నీటిని తోడేశాం..నీటిని తోడిన తర్వాత పిల్లర్ కుంగడం తగ్గింది" అని అధికారులు మంత్రికి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్ ప్రాజెక్టులపై సమగ్రంగా పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ ఇచ్చారు. దీనికి స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇది తీవ్రమైన అంశమనీ, ప్రాజెక్టు సందర్శనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 'అక్కడ ఖర్చు చేసిందెంత ? ఎంత ఆయకట్టుకు నీరిచ్చేందు కు నిర్మాణం జరిగింది ? ఒక్కో ఎకరా సాగుకు అవుతున్న వ్యయమెంత ? అని అధికారులను మంత్రి ప్రశ్నించారు. ఈసమీక్షలో మురళీధర్‌తోపాటు జనరల్ ఈఎన్సీ బి. అనిల్‌కుమార్, కాళేశ్వరం సీఈ వెంకటేశ్వర్లు, సాగునీటిశాఖ సలహాదారు పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా విశ్వాసాన్ని వమ్ము చేయను

**రామగుండం- ప్రభాత సూర్యుడు :** తనపై నమ్మకంతో భారీ మెజార్టీ తో గెలిపించిన రామగుండం ప్రజల రుణం తీసుకుంటానని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారి రామగుండంలో పర్యటించిన మక్కాన్ సింగ్ కు కాంగ్రెస్ కార్యకర్తలు భారీ స్వాగతం పలికారు. నియోజక వర్గ పరిధిలోని బసంత్ నగర్, అంతర్గాం, రామగుండం, గోదావరిఖని పట్టణ పరిధిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు చేసిన అన్యాయాలు, అక్రమాల నుండి ప్రజలను విముక్తి చేస్తానని తెలిపారు. రామగుండం నియోజకవర్గ పరిధిలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు.

# మహిళా ప్రయాణీకులతో టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ కాల్‌సెంటర్లకు ఫోన్ చేసి చెప్పాలని వారికి సూచించారు. సోమవారంనాడాయన సికింద్రాబాద్‌లోని జూబ్లీ బస్‌స్టేషన్ (జేబీఎస్) లో ఆకస్మికంగా పర్యటించారు. అక్కడి బస్సులు ఎక్కి మహిళా ప్రయాణీకులతో మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణంపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా బస్సుల్లోని మహిళలతో ముచ్చటించారు. తమ ప్రాంతానికి మరిన్ని బస్సుల్ని ఏర్పాటు చేయాలని పలువురు మహిళలు ఎమ్‌డీని కోరారు. వారి విజ్ఞప్తులను పరిశీలిస్తానని ఆయన హామీ ఇచ్చారు. జేబీఎస్–ప్రజ్ఞాపూర్, జేబీఎస్–జనగామకు వెళ్లే పల్లె వెలుగు, బాన్సువాడకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోని మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. అక్కడి నుంచి జేబీఎస్–వెంకట్‌రెడ్డి నగర్ (రూట్ నంబర్ 18 వీ/జే) సిటీ ఆర్డినరీ బస్సులో మెట్టుగూడ వరకు ప్రయాణించారు. ఆ బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థినులతో మాట్లాడారు. కండక్టర్‌తో కలిసి వారికి జీరో టికెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి–మహిళలకు ఉచిత బస్ ప్రయాణం'కు మంచి స్పందన వస్తుందన్నారు. మహిళల ప్రయాణ ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చారనీ, మహిళలు, బాలికలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్లు ఈ సౌకర్యం ఉపయోగించుకోవాలని సూచించారు. ఇలాంటి ఓ గొప్ప కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీని భాగస్వామిగా చేసినందుకు ఆయన ప్రభుత్వానికీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే వాటిని సవరించుకుంటూ ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామ న్నారు. 'మహాలక్ష్మి'పై ఇప్పటికే సంస్థలోని 40 వేల మంది సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. మహిళలందరూ స్థానికతను నిర్ధారించుకునేందుకు తమ ఆధార్ కార్డులను సిబ్బందికి చూపించి ఆర్టీసీకి సహకరించాలని కోరారు. ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రవేశపెట్టగానే రద్దీ పెరిగిందనీ, అందుకు అనుగుణంగా బస్సులను నడిపేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. రద్దీ సమయాల్లో ప్రయాణికులు కొంత సమయనం పాటించి.. సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయాణీకులు సంస్థకు ఏవైనా సలహాలు, సూచనలు, ఫిర్యాదులు చేయాలంటే 24 గంటలు అందుబాటులో ఉండే టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నెంబర్లు 040–69440000, 040–23450033 కు ఫోన్ చేసి చెప్పొచ్చన్నారు. వాటిని వెంటనే సరిదిద్దుకునేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎమ్‌డీ వెంట సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (గ్రేటర్ హైదరాబాద్ జోన్) వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, సికింద్రాబాద్ ఆర్ఎంలు శ్రీధర్, ఖుష్రోషా ఖాన్ తదితరులు ఉన్నారు.

# రేవంత్ కలిసి టీజీవో నేతలు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డిని టీజీవో అధ్యక్షురాలు వి మమత, ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ నేతృత్వంలో సోమవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఉద్యోగులందరూ తోడ్పాటునందిస్తారని తెలిపారు. టీజీవో నాయకులు పి రవీందర్‌కుమార్, ఎస్ సహదేవ్, నగర అధ్యక్షులు జి వెంకటేశ్వర్లు, హైదరాబాద్ అధ్యక్షులు ఎంబీ కృష్ణయాదవ్, నాయకులు బి వెంకటయ్య, కృష్ణమూర్తి, సుజాత, సబిత పాల్గొన్నారు.

# డ్రగ్స్ చెలామణిపై ఉక్కుపాదం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** రాష్ట్రంలో మాదక ద్రవ్యాల చెలామణి, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నార్కోటిక్స్ కంట్రోల్ అంశంపై మంగళవారం సచివాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో మాదక ద్రవ్యాలను వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరోకు పూర్తి స్థాయి డైరెక్టర్‌ను నియమించడంతోపాటు ఆ విభాగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. గ్రే హౌండ్స్, ఆక్టోపస్ మాదిరిగా టీ.ఎస్.నాబ్‌ను తీర్చిదిద్దాలని అన్నారు. సమీక్షా సమావేశంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ రవి గుప్తా, ఇంటిలిజెన్స్ విభాగం అదనపు డీజీ శివధర్‌రెడ్డి, సీఎంవో కార్యదర్శి శేషాద్రితోపాటు పోలీస్, ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ, ఔషధ నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకంతో ఆడపడుచులకు లబ్ధి

- ఫ్రీ బస్సు ప్రయాణం ప్రారంభం
- మున్సిపల్ చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి
- కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్ రెడ్డి





**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు :** మహాలక్ష్మి పథకం ద్వారా తెలంగాణ ఆడపడుచులందరికీ లబ్ధి చేకూరుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. సోమవారం పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యాన్ని ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీల్లో రెండు హామీలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా తెలంగాణ మహిళలందరికీ, విద్యార్థులకు, ట్రాన్స్ జెండర్ లకు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా అన్ని ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్ బస్సులలో ఉచిత బస్ ప్రయాణం కల్పిం చిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఇచ్చిన అన్ని హామీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందని, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సారథ్యంలో ప్రతి హామీని మున్సిపాలిటీ ప్రజలకు అందేలా కృషి చేస్తామని తెలిపారు. వైస్ చైర్పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు పసుల రాజేందర్, సిద్దెంకి కృష్ణారెడ్డి, పండుగల జయశ్రీ రాజు, బొర్ర అనురాధ సురేష్, నాయకులు గంట లక్ష్మారెడ్డి, బ్యాంకు డైరెక్టర్ గంట శ్రీనివాస్ రెడ్డి, దండెం రాజ శేఖర్ రెడ్డి, పాల డుగు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## నల్ల కంచె గురుకుల విద్యాలయంలో...

# జోనల్ లెవెల్ సైన్స్ ఫేయిర్ ప్రారంభం



**ఇబ్రహీం పట్నం:- ప్రభాత సూర్యుడు**

ఇబ్రహీంపట్నం నల్ల కంచె గురుకుల విద్యాలయంలో జోనల్ లెవెల్ సైన్స్ ఫెయిర్ జరిగింది. ప్రిన్సిపల్ లీలావతి ఆధ్వర్యంలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిలుగా హాజరైన ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి కౌన్సిలర్ జగన్ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొంది వారి అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. నిత్య నూతన ఆలోచనలే శాస్త్రీయ అభివృద్ధికి దోహదపడుతుందని తెలియ జేశారు. ఈ వైజ్ఞానిక సదస్సులో 65 పాఠశాలల నుండి260 మంది విద్యార్థులు పాల్గొని 130 ప్రద ర్శనలు తీసుకురావడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ ఆర్ ఆర్ తూర్పు రీజినల్ కోఆర్డినేటర్ నాగ కళ్యాణి, హెచ్ ఆర్ ఆర్ ఈస్ట్ జోన్ ప్రిన్సిపాల్, విద్యా కమిటీ చైర్మన్ కంబాల పల్లి సుకన్య బాలరాజ్ , వైస్ చైర్మన్ పలాటి రాములు, సునీత, మంగ, మమత, సబీనా,ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి.అనసూయ(సీతక్క) చొరవ తీసుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంత్రి సీతక్కకు వారు వినతిపత్రాన్ని అందజేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల పోరాటానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కాంగ్రెస్ నేతలు మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీలకు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలకు వెంటనే ఉత్తర్వులను జారీ చేయాలని మంత్రిని కోరారు. అంగన్వాడీలను పర్మినెంట్ చేసి కనీస వేతనం 26 వేలు ఇవ్వడంతో పటు పీఎఫ్, ఈఎస్ఐ, తదితర సౌకర్యాలను కల్పించాలని విన్నవించా రు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించేలా చూడాలన్నారు. 24 రోజుల సమ్మెకాలపు వేతనాలను వెంటనే చెల్లించాలనీ, పెండింగ్ వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. రెండోపీఆర్సీ వర్తింపజేయడంతో పాటు కనీసవేతనం నిర్ణయించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయలు, అర్హులకు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని విన్నవించారు. ప్రమాదబీమా సౌకర్యం రూ.2 లక్షల ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. యాప్‌లన్నీ రద్దు చేసి ఒకటే ఉండేలా చూడాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులివ్వాలని కోరారు. అర్హులైనవారికి ప్రమోషన్లు ఇవ్వాలనీ, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌కు సంబంధం లేని పనులను చేయించొద్దని సూచించారు. మూడేండ్ల రేషన్‌షాపు ట్రాన్స్‌పోర్టు చార్జీలను విడుదల చేయాలని కోరారు. ఆ యూనియన్ రాష్ట్ర కోశాధికారి పి.మంగ, ఉపాధ్యక్షులు డి.సునీత, సహాయ కార్యదర్శి బి.స్వప్న, జి.శారద, రాష్ట్ర నాయకులు పి.నాగమణి, కె.సమ్మక్క, నిర్మల, అన్నపూర్ణ, నర్సమ్మ, బి.నారాయణమ్మ పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215